

కేసీఆర్ కృషితో ఆకుపచ్చ తెలంగాణ

ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో రాష్ట్రం ఆకుపచ్చ తెలంగాణగా మారిందని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. 8లో▸



ఎట్టకేలకు చిక్కిన మొసళ్లు

లక్ష్మణచాంద మండలం మల్లాపూర్ గ్రామంలోని చెరువులోని మొసళ్లు బోనులో చిక్కాయి. ఈ నెల 1న అటవీశాఖ ఆధ్వర్యంలో రెండు బోనులు ఏర్పాటు చేశారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
41.8 /29.6

వాతావరణం

ఆకాశంలో అక్కడక్కడ మబ్బులు ఉంటాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉదయం 11 గంటల నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. రాత్రి వరకు వేడి సెగలు, ఉక్కపోత ఉంటాయి.

న్యూస్‌రీల్

న్యాయ వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి దేవేంద్రబాబు

ముథోల్: న్యాయ వ్యవస్థపై గ్రామీణులు అవగాహన పెంచుకోవాలని భైంసా సివిల్ కోర్టు జడ్జి దేవేంద్రబాబు అన్నారు. మండలంలోని రాం టెక్, మచ్కల్ గ్రామాల్లో మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో జడ్జి మాట్లాడుతూ ఈనెల 10న భైంసా సివిల్ కోర్టులో నిర్వహించే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించా రు. క్షణికావేశంలో చేసిన నేరాలను రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని సూచించారు. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ సమ యం, డబ్బులు వృథా చేసుకోవద్దన్నారు. లోక్‌అదాలత్ ప్రత్యామ్నాయ వివాద పరిష్కార వే దిక అని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు మాధవి, రఘువీర్, మచ్కల్ సర్పంచ్ కరండేకర్ మైసాజీ, రాంటెక్ సర్పంచ్ భుజ వత్సలబాయి, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

12న 2కే రన్

నిర్మల్ టౌన్: నిర్మల్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఈనెల 12న ఉదయం 6 గంటలకు 2కే రన్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ ప్రవీణ్‌కుమార్ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి మంచిర్యాల్ చౌరస్తా వరకు, తిరిగి స్టేడియం వరకు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ రన్‌లో పట్టణంతోపాటు జిల్లా అంతటి నుంచి యువతీ యువకులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొనాలని సూచించారు. అన్నివర్గాలవారు భాగస్వాములు కావాలని కోరారు.

11న జిల్లాస్థాయి కవి సమ్మేళనం

నిర్మల్ రూరల్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 11న తెలంగాణ సాహిత్య దినోత్సవం పురస్కరించుకుని జిల్లాస్థాయి కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నూతన కలెక్టరేట్ భవనంలో సాయంత్రం 4 గంటలకు జరిగే కార్యక్రమానికి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. కవితాగానం చేసే కవులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. తెలుగు, ఉర్దూ భాషలలో పద్య, గద్య కవితాగానం చేసే కవులు 99639 34894, 94923 71812 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

బడి ఫీజులు భారం!

- భారీగా పెంచిన ప్రైవేటు యాజమాన్యాలు
- ఏటా 10 నుంచి 30 శాతం వరకు పెరుగుదల
- డీజీ, టెక్నో, ప్రైమ్, లీడ్ పేరిట అదనపు బాదుడు
- 'సర్కారు'కు పోలేక.. 'ప్రైవేటు'ను తట్టుకోలేక
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు
- పిల్లలున్న ఇళ్లల్లో ఇప్పుడిదే ముచ్చట



నిర్మల్: శ్రీనివాస్.. ఓ మధ్యతరగతి తండ్రి. తన కున్న వ్యాపారంతో భార్యా ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నారు. తమకు ఇబ్బందైనా ఫర్వాలేదు కానీ.. పిల్లలకు మంచి చదువులు చెప్పించాలి.. మంచి భవిష్యత్తు ఇవ్వాలని ఆ తల్లిదండ్రుల ఆలోచన. తన బిడ్డకు బడికి వెళ్లడం అలవాటు కావాలన్న ఉద్దేశంతో ఇంటివద్ద ఉన్న బడిలోనే చదివించాడు. ఈ ఏడాది 2వ తరగతికి రావడంతో మంచి స్కూల్లో వేసేందుకు సిద్ధమయ్యాడు. ముందుగా పేరున్న స్కూల్లో ఫీజులు, పుస్తకాలు, వాతావరణం, విద్య.. ఎలా ఉందో తెలుసుకునేందుకు వెళ్లాడు. అక్కడ వాతావరణం చూస్తే బాగానే ఉంది. కానీ.. ఫీజుల విషయం తెలియగానే శ్రీనివాస్‌కు దిమ్మతిరిగినంత పనైంది. తన ముందున్న మేడమ్ ఫీజుల వివరాలు, పుస్తకాలు, యూనిఫాం ధరలు చెబుతుంటే నోరెళ్లబెట్టాడు. 'మేడమ్.. ఒక్కక్షణం.. నా పాప రెండో తరగతి..' అని చెబుతున్నంతలోనే ఆమె 'ఎస్ సర్.. నేను చెప్పేది రెండో తరగతికే.. అంతా కలిపి రూ.45 వేలు అవుతాయి..' అని ఖరాకండిగా చెప్పేసింది. శ్రీనివాస్ నోట మరో మాట రాలేదు. లేచి అలాగే.. బయటకు వచ్చేశాడు. చిన్నదానికే ఇంత పెంచితే.. 5వ తరగతికి వెళ్లే పెద్దోడి ఫీజెంత పెరిగిందోనన్న ఆలోచనలో పడ్డాడు. ఓవైపు పిల్లల భవిష్యత్తు.. అలాగని అంతంత ఫీజులు కట్టలేని పరిస్థితి.

ఇది ఒక్క శ్రీనివాస్‌కే కాదు.. ఇవ్వాళ్ల పిల్లలున్న ప్రతీ ఇళ్లల్లో వారి చదువులకు సంబంధించిన ముచ్చటే నడుస్తోంది. పేద, మధ్యతరగతి కుటుంబాల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. చాలీచాలని వసతులు, అంతంత మాత్రం పట్టింపులతో సాగే సర్కారు బడులకు పిల్లలను పంపడానికి వెనుకంజ వేస్తున్నారు. అలాగని ప్రైవేటుకు పంపిద్దామంటే ఏడాదికేడాది పెరుగుతున్న ఫీజులు గుండెదడ పెంచుతున్నాయి.

సంపాదనంతా చదువుకే..

రోజురోజుకూ పిల్లల చదువులు తల్లిదండ్రులకు భారంగా మారుతున్నాయి. విద్య వ్యాపారంగా మారడంతో ప్రైవేటుస్కూళ్లల్లో చదివించాలంటేనే బెంబేలెత్తున్నారు. కొత్త విద్యాసంవత్సరం వస్తోందంటేనే తల్లిదండ్రులకు వణుకుపుడుతోంది. ఆ ఫీజు.. ఈ ఫీజు.. పుస్తకాలు, యూనిఫాంలు, బస్సు చార్జీలంటూ స్కూళ్ల నుంచి ఫోన్లు వస్తే చాలు ఏం మాట్లాడాలో తెలియడం లేదు. ఏడాదంతా కష్టపడి కూడబెట్టుకున్నదంతా ఒక్కనెలలోనే ఖర్చయిపోతోంది. డబ్బులు అడ్జస్ట్ కాకపోతే అప్పుచేసి మరీ పిల్లల ఫీజులు కడుతున్న పరిస్థితి.

తప్పని పరిస్థితి..

పెరుగుతున్న పోటీ ప్రపంచాన్ని తమ పిల్లలు తట్టుకోవాలంటే వారికి మంచి చదువు అందించాలన్న తపన ప్రతీ తల్లిదండ్రుల్లో కనిపిస్తోంది. ఇటీవల అలాంటి ఆలోచన మరింత పెరిగింది. అందుకే ఐదారు తరగతుల్లోనే జిల్లాను దాటి హైదరాబాద్ వరకూ వెళ్లి పిల్లలను అక్కడ హాస్టళ్లల్లో ఉంచి చదివిస్తున్నారు. కాస్త ఆర్థికంగా ఉన్న కుటుంబాలకు పెద్దగా ఇబ్బంది ఉండటం లేదు. కానీ, మధ్యతరగతి కుటుంబాలే అటుఇటు కానీ డోలాయమానంలో నలిగిపోతున్నాయి. అందరిలాగే తమ పిల్లలకు మంచి చదువు అందించాలన్న ఆలోచన, కానీ ఆ ఫీజులు చూసి తట్టుకోలేమన్న ఆవేదన కుంగదీస్తోంది. ఆస్తులు ఇవ్వకున్నా పిల్లలకు మంచి చదువులు ఇస్తే చాలన్న వాదనతోనూ చాలామంది ముందడుగు వేస్తున్నారు.

ఉత్తర్వులు బేఖాతరు...

ప్రభుత్వం జారీచేసే ఉత్తర్వులు, విద్యాహక్కు చట్టం నిబంధనలను ప్రైవేట్ స్కూళ్లు తుంగలో తొక్కుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాలను పూర్తిగా బేఖాతరు చేస్తున్నాయి. విద్యాశాఖ అధికారులు సైతం నిబంధనల అమలును ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

- జిల్లాలో ఇప్పటివరకు ఫీజుల నియంత్రణ కమిటీని ఏర్పాటు చేయలేదు.
- ప్రైవేట్ పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీల ముచ్చటే లేదు.
- పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ, యూనిఫాం తదితరాలను విక్రయించవద్దని నిబంధనలు ఉన్నా పట్టించుకోవడం లేదు.
- పాఠశాల ఫీజులతోపాటు పరీక్షల ఫీజులను నోటీసు బోర్డులపై పెట్టడం లేదు.
- పాఠశాలల పేర్ల వెనుక తోక పేర్లు రాయకూడదు. అయినా వీటిని పట్టించుకోడం లేదు.

బడులూ అంతే..

చాలా ప్రైవేటు స్కూళ్లు ప్రస్తుత పరిస్థితులను 'క్యాష్' చేసుకోనేందుకు పోటీ పడుతున్నాయి. టెక్నో, డిజీ, ఒలింపియాడ్, ప్రైమ్, స్పేస్, ఐఐటీ, లీడ్.. ఇలా తమ స్కూళ్లకు ఏవేవో తోక పేర్లు తగిలించి ఆకర్షిస్తున్నాయి. తమ పిల్లలకు ఉత్తమ భవిష్యత్తునివ్వాలన్న ఏకైక ఆశతో ఉన్న తల్లిదండ్రుల బలహీనతే ఇలాంటి స్కూళ్లకు వరంగా మారుతోంది. ఏటా భారీగా ఫీజులు పెంచుతున్నారు. నర్సరీ చదువుకే వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. వీటిని నియంత్రించాల్సిన విద్యాశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలున్నాయి.

నిబంధనలు పాటించాలి..



జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలూ మెరుగైన ప్రతిభను చాటుతున్నాయి. ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేయడం సరికాదు. నియంత్రణకు చర్యలు చేపడుతాం. విద్యాహక్కు చట్టం నిబంధనలను పాటించాలి.

– రవీందర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

నేడు నస్పూర్‌కు కేసీఆర్



సీఎం బహిరంగ సభకు సిద్ధమైన వేదిక

- సీఎం పర్యటనకు సర్వం సిద్ధం
- కొత్త కలెక్టరేట్, పార్టీ కార్యాలయం, పథకాలు ప్రారంభం
- చెన్నూరు ఎత్తిపోతలతోపాటు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- నస్పూర్‌లో భారీ బహిరంగ సభ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సీఎం కేసీఆర్ మంచిర్యాల జిల్లా పర్యటనకు సర్వం సిద్ధం చేశారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఐదేళ్ల తర్వాత జిల్లాకు వస్తుండడంతో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఉత్సాహంగా ఉన్నారు. శుక్రవారం సాయంత్రం నస్పూర్‌కు రానున్న సీఎం కేసీఆర్ మొదట బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభిస్తారు. తర్వాత కలెక్టరేట్ ప్రారంభించిన అనంతరం బహిరంగ సభాస్థలికి వెళ్తారు. బీసీ కులవృత్తులకు ఆర్థిక చేయూతనిచ్చే రూ.లక్ష ఆర్థికసాయం పథకం, రెండో విడత దళితబంధు, స్థలం ఉండి, ఇల్లు కట్టుకునే వారికి రూ.3లక్షల సాయం అందించే గృహలక్ష్మి పథకం ప్రారంభిస్తారు. లబ్ధిదారులకు సీఎం చేతులమీదుగా చెక్కులు అందిస్తారు. దొనబండకు చెందిన వారికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తారు. కాళేశ్వరం ప్రా జెక్టు నుంచి రూ.1,658 కోట్ల వ్యయంతో, లక్ష ఎకరా లకు సాగునీరందించే చెన్నూరు ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేస్తారు. మందమర్రిలో రూ.500 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఆయిల్‌పాం ఫ్యాక్టరీ, రూ.164 కోట్లతో గోదావరినదిపై నిర్మించనున్న మంచిర్యాల, అంతర్గాం రోడ్డు బ్రిడ్జి, హాజీపూర్ మండలం గుడిపేటలో రూ.205 కోట్లతో మెడికల్ కాలేజీకి శంకుస్థాపన చేయనున్నారు.

భారీ బహిరంగ సభ

సీఎం కేసీఆర్ పర్యటనకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రం మంచిర్యాల ఐబీ చౌరస్తా నుంచి నస్పూర్ వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పార్టీ నాయకులు రోడ్లు, డివైడర్ల వెంట భారీ ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, గులాబీ జెండాలతో అలంకరించారు. నస్పూర్ పట్టణం కలెక్టరేట్ సమీపంలోనే 40 ఎకరాల్లో సభకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు. 200 మంది కూర్చునేలా భారీ వేదిక సిద్ధం చేశారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎంపీ వెంకటేశ్ నేత, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కుమార్ తదితరులు పనులు పర్యవేక్షిస్తున్నారు. గ్రామ, మండల, పట్టణాల్లో సన్నాహక సభలతో కార్యకర్తలు, నాయకులు భారీగా జనాన్ని తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. తాగునీటి కోసం వాటర్ ప్యాకెట్లు, కూల్ వాటర్, మజ్జిగ ప్యాకెట్లు, భోజనాలు సిద్ధం చేశారు. వేదిక ముందు కుర్చీలు, టెంట్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, పార్కింగ్, భారీ లైటింగ్‌లు ఏర్పాటు చేశారు.

రెండు వేల మందితో బందోబస్తు

సీఎం పర్యటనకు భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆరుగురు డీసీపీ స్థాయి అధికారులు, 21మంది అడిషనల్ ఎస్పీలు, 62మంది సీఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, పీసీలు, హోంగార్డులు, స్పెష ల్ పార్టీ, మహిళా పోలీసులతో మొత్తం 2350మంది పోలీసులతో బందోబస్తు సాగనుంది. ఈ మేరకు మంచిర్యాల డీసీపీ రామ్‌నాథ్ కేకన్, పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్ నేతృత్వంలో పటిష్ట భద్రత చర్యలు చేపడుతున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు, ఆటంకాలు తలెత్తకుండా ముందస్తుగానే అన్ని చర్యలు తీసుకున్నారు.

కుల వృత్తులకు ప్రోత్సాహం

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభిస్తున్న మంత్రి

నిర్మల్ టౌన్: తెలంగాణ ప్రభుత్వం స్వరాష్ట్రంలో కుల వృత్తులకు అండగాఉంటూ ప్రోత్సహిస్తోందని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై స్టాళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ మిషన్ కాకతీయ కార్యక్రమం ద్వారా చెరువుల పునరుద్ధరణ చేపట్టారన్నారు. నిర్మల్ నియోజకవర్గంలోని మొత్తం 178 చెరువుల మరమ్మతు పనులను రూ.4205.92 లక్షల ఖర్చుతో చేపట్టినట్లు తెలిపారు. చెరువులు, నదులలో ఏటా ఉచితంగా చేప, రొయ్య పిల్లల్ని వదులుతున్నట్లు తెలిపారు. తద్వారా మత్స్యకారులకు జీవనోపాధి కల్పిస్తున్నారని పేర్కొన్నారు. మత్స్యకారులు చేపలు పట్టడానికి వలలు, రవాణాకు మోపెడ్లు, టాటాఏస్ వాహనాలు, నిల్వకు ఐస్ బాక్సులు, ఎలక్ట్రానిక్ సబ్సిడీపై అందించినట్లు వివరించారు. త్వరలో కమ్యూనిటీ హాళ్లు కూడా నిర్మిస్తామని తెలిపారు. మటన్, చికెన్ కంటే చేపలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ చేపలు తినడానికే మొగ్గు చూపాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, మత్స్యశాఖ అధికారి, ఉద్యోగులు, పెద్ద ఎత్తున మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

పంటలకు మరింత 'మద్దతు'



- 13 రకాల పంటల ధర పెంచిన కేంద్రం
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

లక్ష్మణచాంద: సాగు చేసే పంటలకు మద్దతు ధర లేక.. పెట్టిన పెట్టుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ క్రమంలో ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేస్తున్న అన్నదాతను ఆదుకునేందుకు కేంద్రం అన్నిరకాల చర్యలు చేపడుతుంది. ముఖ్యంగా రైతులు సాగు చేస్తున్న పంటలకు ఏటా మద్దతు ధర పెంచి రైతులకు అండగా నిలుస్తుంది. ఇందులో భాగంగా 2023–24 సంవత్సరానికి సంబంధించి పలు రకాల పంటల మద్దతు ధర(ఎంఎస్‌పీ) పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రధానంగా ఆహార పంటలైన పప్పు దినుసుల మద్దతు ధర అధికంగా పెంచింది. దీనిపై జిల్లా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేంద్రం పెంచిన ఎంఎస్‌పీ ఇలా....

కేంద్రం బుధవారం పలు రకాల ప్రధాన పంటలకు కనీస మద్దతు ధరను పెంచింది. వరి సాధారణ రకం క్వింటాల్ ధర రూ.143, ఏ గ్రేడ్ వరి రకం రూ.143, జొన్నకు రూ.210, సజ్జలు రూ.150, రాగులు రూ.268, మొక్కజొన్న రూ.128, కందికి రూ.400, పెసరకు రూ.803, మినుములు రూ.350, వేరుశనగకు రూ.527, పొద్దుతిరుగుడు రూ.360, సోయాబీన్ రూ.300, నువ్వులు రూ.805, పత్తికి రూ.640 పెంచింది. దీంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

పప్పు ధాన్యాల సాగు ప్రోత్సహించేలా..

రైతులు వివిధ కారణాలతో ఆహార పంటల సాగు విస్తీర్ణం తగ్గిస్తున్నారు. వాణిజ్య పంటలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. జిల్లాలో కూడా వరి తర్వాత సోయా, మొక్కజొన్న ఎక్కువగా సాగుచేస్తున్నారు. కందులు, మినుము, పెసర, వేరుశనగ వంటి ఆహార పంటల సాగు తగ్గింది. వాణిజ్య పంట అయితే పత్తి, మిరప సాగుపై ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఆహార పంటల దిగుబడి తగ్గుతోంది. ఈ నేపథ్యంలో ఆహార ధాన్యాల మద్దతు ధరను కేంద్రం ఎక్కువగా పెంచింది.

పెరిగిన ధరలు(క్వింటాల్‌కు రూ.లలో)

పంట	గతేడాది	ఈ ఏడాది	పెరిగింది
పత్తి	6,380	7,020	640
వరి	2,060	2,183	143
వరి సాధారణ రకం	2,040	2,183	143
వరి ఏగ్రేడ్ రకం	2,060	2,203	143
కంది	6,600	7,000	400
పెసర	7,755	8,558	803
సోయబీన్	4,300	4,600	300
నువ్వులు	7,830	8,365	985
మొక్కజొన్న	1,962	2,090	128
వేరుశనగ	5,850	6,377	527
జొన్న	2,990	3,225	235
మినుము	6,600	6,950	350
రాగులు	3,578	3,846	268
సజ్జలు	2,350	2,500	150
పొద్దుతిరుగుడు	6,400	6,760	360

సంతోషంగా ఉంది..



అన్నదాతలు సాగు చేస్తున్న పలు రకాల పంటలైన వరి, జొన్న, మొక్కజొన్న, పత్తి, సోయాబీన్, సజ్జల మద్దతు ధర పెంచడం సంతోషంగా ఉంది. వరికి ఇంకాస్త పెంచితే బాగుండేది.

– నర్సారెడ్డి, యువ రైతు, లక్ష్మణచాంద

పెట్టుబడి కూడా రావడం లేదు..



పంటలకు సరైన మద్దతు ధరలు లేవు. ఆరుగాలం కష్టపడినా పెట్టుబడి రావడం లేదు. విత్తనాలు, ఎరువుల ధరలు భారీగా పెంచుతున్న ప్రభుత్వం పంటల మద్దతు కొంతే పెంచుతోంది.

– ముత్తన్న, రైతు పీచర

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



పంటలకు కనీస మద్దతు ధరలను పెంచిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. రానున్న కాలంలో ధర మరింత పెంచాలి. పెట్టుబడితో పోల్చితే పంటల మద్దతు ధర తక్కువగానే ఉంటుంది.

– శ్రీనివాస్ యువ రైతు, లక్ష్మణచాంద

జిల్లా ఆస్పత్రిలో 'క్రిటికల్ కేర్'

- రూ.23.75 కోట్లతో 50 పడకలు
- పీఎం ఏబీహెచ్ఐఎం నిధుల మంజూరు

నిర్మల్: జిల్లాలో వైద్య సేవలు మరింత మెరుగయ్యే దిశగా నిధులొచ్చాయి. క్రిటికల్ కేర్ సేవల కోసం ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్(పీఎం–ఏబీహెచ్ఐఎం)కింద జిల్లా ఆస్పత్రికి రూ.23.75కోట్లు మంజూరయ్యాయి. నిర్మల్‌తోపాటు రాష్ట్రంలోని నాలుగు ఆస్పత్రులకు వైద్యారోగ్యకుటుంబ సంక్షేమశాఖ ఈ నిధులను మంజూరు చేసింది.

ఇప్పటికీ ఇబ్బందే..

జిల్లాలో వైద్యసేవలు రోజురోజుకూ మెరుగవుతున్నా.. విషమ పరిస్థితుల్లో ఉన్న పేషెంట్లకు, క్షతగాత్రులకు సరిపడా వైద్యసదుపాయాలు లేవు. చాలా సందర్భాల్లో జిల్లా ఆస్పత్రిలో ఉన్న ఐసీయూ సరిపోవడం లేదు. కరోనా, తదనంతర సమయంలో దారుణమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. వైద్యులు పెరుగుతున్నా సరైన సదుపాయాలు లేకపోవడం ఇబ్బందిగా మారింది.

50 పడకలతో..

జిల్లాల్లో క్రిటికల్ కేర్ వైద్యసేవలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు తాజాగా నిధులు మంజూరు చేశారు. రాష్ట్రంలో ఖమ్మం, భూపాలపల్లి, వికారాబాద్‌తోపాటు నిర్మల్ జిల్లా ఆస్పత్రికీ పీఎం–ఏబీహెచ్ఐఎం కింద నిధులిచ్చారు. మొత్తం రూ.23.75 కోట్లతో జిల్లా ఆస్పత్రిలో 50 పడకలతో క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న ఐసీయూకు అదనంగా ఈ బ్లాక్ ఏర్పాటుకానుంది. ఇప్పటికే జిల్లా ఆస్పత్రి భవనంలో పై అంతస్తు నిర్మాణం పూర్తికావస్తుంది. గదుల సంఖ్య పెరుగుతుంది. క్రిటికల్ కేర్ బ్లాక్ ఏర్పాటుకు పెద్దగా ఇబ్బంది లేదని వైద్యాధికారులు పేర్కొన్నారు.

హర్షనీయం..

జిల్లా ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ బ్లాక్ ఏర్పాటుకు రూ.23.75 కోట్లు మంజూరు కావడం హర్షనీయం. ఈ బ్లాక్ ఏర్పాటుతో మరింతమంది పేషెంట్లకు మెరుగైన వైద్యసేవలు అందించే అవకాశం ఏర్పడుతుంది.

– డాక్టర్ దేవేందర్‌రెడ్డి, డీసీహెచ్ఎస్

ఊర చెరువులు ఉపాధికి మార్గాలు



ఊరేగింపుగా చెరువు వద్దకు మంత్రి, కలెక్టర్..



బతుకమ్మ ఆడుతున్న ఐకేరెడ్డి, వరుణ్‌రెడ్డి

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్ రూరల్: తెలంగాణలో ఊర చెరువులు ఉపాధికి మార్గాలుగా మారాయని, వాటిని గ్రామస్తులు వినియోగించుకోవాలని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వెంగవాపేట్ గ్రామంలో నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో గురువారం చెరువుల పండుగ నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి మంత్రి హాజరయ్యారు. మహిళలు, రైతులు బతుకమ్మలతో వారికి స్వాగతం పలికారు. గ్రామం నుంచి చెరువు వరకు మత్స్యకారులు వలలతో ర్యాలీ నిర్వహించారు. చెరువు వద్ద మంత్రి, కలెక్టర్, ఎస్ఈ సుశీల్ కుమార్ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. అనంతరం చెరువు కట్టపై మైసమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏడాది రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... గ్రామంలో ఉన్న చెరువును రూ.96 లక్షలతో పునరుద్ధరించామని తెలిపారు. దీంతో గతంలో 200 ఎకరాలు ఉన్న ఆయకట్టు ప్రస్తుతం 600 ఎకరాలకు పెరిగిందన్నారు. కాళేశ్వరం నీటిని శ్రీరాంసాగర్‌లో నింపి అక్కడి నుంచి స్వర్ణ వాగుకు మళ్లించి ఈ ప్రాంత రైతులకు ప్రతీ ఎకరానికి సాగు నీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఈ రామారావు, ఆర్డీవో స్రవంతి, డీఎస్పీ జీవన్‌రెడ్డి, తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో సాయిరాం, డీసీఎం సాయిప్రసాద్, సర్పంచ్ కొప్పుల గంగయ్య, ఎంపీటీసీ సాయన్న, నాయకులు మురళీధర్‌రెడ్డి, భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇసుక డంపులు సీజ్



దంపులు సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు

కడెం: మండలంలోని చిట్యాల్ గ్రామ సమీపంలో ఇసుక డంపులను గురువారం సీజ్ చేసినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్య తెలిపారు. మొత్తం 35 ట్రాక్టర్ల ఇసుక కుప్పలను పంచనామా నిర్వహించి తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదించినట్లు ఆయన తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

టాస్క్‌ఫోర్స్ బృందాల తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: విత్తనాలు, ఎరువుల దుకాణాలను టాస్క్‌ఫోర్స్ బృందాలు గురువారం తనిఖీలు చేపట్టారు. ఆదిలాబాద్ పట్టణంలోని విత్తన దుకాణాలు, గోదాములను పోలీసుశాఖ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్‌లు, కంపెనీ నుంచి వచ్చిన ఇన్ వాయిస్‌లను పరిశీలించారు. రోజువారి అమ్మకాలు ఏవిధంగా ఉన్నాయనే విషయాలను తెలుసుకున్నారు. గోదాములో ఉన్న నిల్వలు రిజిస్టర్‌లో ఉన్న వాటితో సరిగ్గా ఉన్నాయా లేవా అనే విషయాలపై ఆరా తీశారు. జిల్లాకు కేటాయించిన విత్తనాలు ఇక్కడి రైతులకే విక్రయించాలని ఆదేశించారు. మహారాష్ట్ర రైతులకు విత్తనాలు విక్రయిస్తే ఇక్కడి రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ టాస్క్‌ఫోర్స్ బృందంలో జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, వన్‌టౌన్ ఎస్సై మహ్మద్ కలీమ్, ఆదిలాబాద్ అర్బన్ ఏఓ రమేష్ ఉన్నారు.

కొట్టుకుపోయిన వైకుంఠధామం రేకులు



కొట్టుకుపోయిన వైకుంఠధామం రేకులు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలోని గోదావరి వద్ద బుధవారం రాత్రి వీచిన గాలి దుమారానికి వైకుంఠధామంపై రేకులు కొట్టుకుపోయాయి. సుమారు రూ.60లక్షల వరకు వెచ్చించి వైకుంఠధామాన్ని నిర్మించిన నాటి నుంచి వర్షాకాలంలో పలుసార్లు దెబ్బతిన్న వైకుంఠధామం ఈ ఏడు వర్షాకాలానికి ముందే రేకులు లేచిపోయాయి. దీంతో లక్షలు వెచ్చించి నిర్మించిన పనుల్లో నాణ్యత లేకపోవడంతోనే పదేపదే వైకుంఠధామం వద్ద మరమ్మతు పనులు తలెత్తుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు.

తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తిపై కేసు

లక్ష్మణచాంద: మండల తహసీల్దార్‌పై తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన కుంటాల సాయన్న అనే వ్యక్తి వాట్సప్‌లో యువ సైన్యం పేరిట గ్రూపును తయారు చేసి అందులో మండల తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది జింక మాంసంకు బదులు కుక్క మాంసం తిన్నారని తప్పుడు ప్రచారం చేసినందున గురువారం ఆర్ఐ దేవిక ఫిర్యాదు మేరకు సాయన్న అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు.

నోరూరించే చేప రుచులు



నిర్మల్‌లో ఫుడ్‌ను రుచి చూస్తున్న మంత్రి ఐకేరెడ్డి, కలెక్టర్



చేపల వంటకాల్లో బిజీగా ఉన్న మహిళలు



చేపల ఫ్రై చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వం మూడు రోజుల పాటు ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తోంది. అందులో భాగంగా గురువారం నిర్మల్ జిల్లాలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఫిష్ ఫెస్టివల్‌ను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించారు. స్వయంగా గరిట పట్టి చేపలను ఫ్రై చేస్తూ రుచులు చూశారు. అలాగే ఆదిలాబాద్‌లో సైతం ఫిష్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. మహిళలు చేపలతో నోరూరించే వంటలు సిద్ధం చేశారు. - సాక్షి ఫొటోగ్రాఫర్లు, నిర్మల్, ఆదిలాబాద్



ఫిష్ పచ్చడి



ఆదిలాబాద్‌లో ఫిష్ ఫ్రై చేస్తున్న మహిళలు



ఫిష్ ఫ్రై



ఆదిలాబాద్ వంటకు చేపలు చూపిస్తున్న మహిళ



ఆదిలాబాద్‌లో చేప బిర్యానీ, ఆహార పదార్థాలు



చేపల వంటకు సిద్ధం చేస్తూ...

రైతు సంక్షేమానికి కేంద్రం కృషి

- పీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

నిర్మల్‌ఖిల్లా: రైతు సంక్షేమానికి నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉందని ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్న గారి భూమయ్య, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రామనాథ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నరేంద్ర మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ప్రతి సంవత్సరం పెంచుకుంటూ పోతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పండించే వరి, మొక్కజొన్న, పత్తి, పెసరు, మినుము, కందులు తదితర పంటలకు గిట్టుబాటు ధరలను పెంచుతూ రైతులను ఆదుకోవడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముందుంటుందని తెలిపారు. నరేంద్ర మోడీ రైతు పక్షపాతిగా నిలువగా, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు వ్యతిరేకిగా ముద్ర వేసుకున్నారని విమర్శించారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా రోడ్లమీదనే కుప్పలుగా రోజుల తరబడి ఉండడంతో వర్షాలకు కొట్టుకుపోతున్నాయని, ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి వారికి మద్దతు ధరను రాష్ట్ర ప్రభుత్వం 500 రూపాయల బోనస్ గా ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు ముత్యం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలేటి లింగారెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రజిని వైద్య, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు పొన్నం నారాయణ గౌడ్, సీనియర్ నాయకులు అంజుకుమార్ రెడ్డి, రచ్చ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు చిక్కిన మొసళ్లు

- పట్టుకున్న అటవీశాఖ అధికారులు
- ఊపిరి పీల్చుకున్న మల్లాపూర్ వాసులు



పట్టుకున్న మొసళ్ల వద్ద డిప్యూటీ ఎఫ్ఆర్వో

లక్ష్మణచాంద: ఎట్టకేలకు మండలంలోని మల్లాపూర్ గ్రామంలోని చెరువులోని మొసళ్లు బోనులో చిక్కాయి. గ్రామంలోని ఊర చెరువులో రెండు మొసళ్లు ఉన్నాయని గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు తెలుపడంతో ఈ నెల 1న అటవీశాఖ ఆధ్వర్యంలో మండలంలోని మల్లాపూర్ గ్రామంలోని చెరువులో రెండు బోనులు ఏర్పాటు చేశారు. అందులో చేపలు, చికెన్‌ను ఉంచడంతో మత్స్యకారుల సహాయంతో ఎట్టకేలకు గురువారం రెండు మొసళ్లు బోనులో చిక్కాయి. దీంతో సమాచారం అందుకున్న డెప్యూటీ ఎఫ్ఆర్వో నజీర్ ఖాన్ ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారులు మల్లాపూర్ గ్రామానికి చేరుకుని బోనులోని మొసళ్లను అక్కడి నుంచి తరలించారు. దీంతో మల్లాపూర్ వాసులు మొసళ్ల లభించడంతో ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం అటవీశాఖ అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో సర్పంచ్ రవి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో సొంతింటికి నిప్పు



కాలిపోయిన ఇల్లు

గుడిహత్నూర్: మద్యం మ త్తులో ఓ ప్రబుద్ధుడు తన ఇంటికే నిప్పుపెట్టుకున్నాడు. స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని తోషం గ్రా మానికి చెందిన మద్దెల రాజన్న భార్యను వదిలేసి కూలీ పనులు చేస్తూ తల్లి వద్దే ఉంటున్నాడు. గురువారం మద్యం మత్తులో ఇంట్లోని సామగ్రిని బయట పడేశాడు. ఆ సమయంలో ఎవరూ లేక పోవడంతో ఇంటికి నిప్పుపెట్టి బయటపడ్డాడు. గమనించిన స్థానికులు మంటలను ఆర్పివేశారు. ఫైర్ ఇంజన్ వచ్చే సరికి మంటలు అదుపులోకి వచ్చాయి. స్థానికులు రాజన్నను పోలీసులకు అప్పగించారు.

ప్రాణం తీసిన చేపల వేట



దర్శ సునీల్(ఫైల్)

తలమడుగు: చేపల వేట ఓ యువకుడి ప్రాణాలు బలిగొంది. ఈ సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన దర్శ సునీల్ (24) బుధవారం చేపల వేట కోసం మద్యం మత్తులో సమీపంలోని భీమన్న వాగులోకి వెళ్లాడు. చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందాడు. ఉదయం స్థానికులు వాగు వద్దకు వెళ్లగా నీటిలో మృతదేహం కనిపించడంతో కుటుంబ సభ్యులు చేరుకుని బోరున విలపించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అప్పారావు తెలిపారు.

వడదెబ్బతో ఒకరి మృతి

భైంసారూరల్: మండలంలోని మిర్జాపూర్ గ్రామంలో వడదెబ్బ తగిలి షేక్ అస్లామ్(50) గురువారం మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం... కుభీర్ మండలంలోని లింగా గ్రామానికి చెందిన షేక్ అస్లామ్ కొంతకాలంగా భైంసా పట్టణంలో సివిల్ సప్లయ్ హమాలీగా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం మిర్జాపూర్‌లో రేషన్ బియ్యాన్ని దించేందుకు తోటి కూలీలతో కలిసి వెళ్లాడు. రేషన్ షాపులో లారీ నుంచి బియ్యం సంచులు దించుతూ ఒక్కసారిగా కుప్పకూలి కిందపడిపోయాడు. గమనించిన కూలీలు భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించే క్రమంలో మృతి చెందాడు. మృతుడికి భార్యతోపాటు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఉరివేసుకొని ఒకరి ఆత్మహత్య

ముథోల్: మండలంలోని విఠోలి గ్రామానికి చెందిన లక్ష్మణ్ (35) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం... లక్ష్మణ్ కొంత కాలంగా మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేదింటి బాలికల వరం.. కస్తూర్బాలు

- పాఠశాల చుట్టూ సీసీ కెమెరాల నిఘా
- మెనూ ప్రకారం రుచికరమైన భోజనం
- చదువుతో పాటు వృత్తి విద్యా కోర్సులపై ప్రత్యేక శిక్షణ
- ఆత్మరక్షణ కోసం కరాటే, ఇతర సౌకర్యాలు



నేరడిగొండ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం

నేరడిగొండ: పేదింట్లో పుట్టిన నిరుపేద బాలికలకు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీ) ఓ వరంగా మారాయి. చదువుకోవాలని ఆసక్తి ఉండి చదివించే స్తోమత లేని ఎంతో మందికి ఈ విద్యాలయాలు తోడుగా నిలుస్తున్నాయి. అనాథ బాలికలకు, తల్లి ఉండి తండ్రి లేని, తండ్రి ఉండి తల్లిలేని బాలికలకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లా వ్యాప్తంగా మొత్తం 17 కేజీబీవీలు ఉన్నాయి. వీటిలో 11 విద్యాలయాల్లో ఇంటర్ తరగతులు కొనసాగుతుండగా, ఈ విద్యా సంవత్సరం నుంచి మరో ఒక కేజీబీవీలో ఇంటర్ అందుబాటులోకి రానుంది. వీటిలో కొన్ని కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, మరికొన్ని చోట్ల సీఈసీ, ఎంపీహెచ్ డబ్ల్యూ కోర్సుల చొప్పున కేటాయించారు. ఒక్కో కోర్సుకు 40 సీట్ల చొప్పున భర్తీ చేయనున్నారు. బాలికలకు ఆసక్తి ఉన్న కోర్సులను కేటాయించిన కళాశాలలో విద్యను కొనసాగించే విధంగా అవకాశాన్ని కల్పించారు.

ఇంటర్ కళాశాలల వివరాలు..

ఆదిలాబాద్ అర్బన్, బేల, భీంపూర్, బోథ్, నేరడిగొండ, ఉట్నూర్, గాదిగూడ, తలమడుగు మండలాల్లోని కేజీబీవీ పాఠశాల్లో బైపీసీ, ఎంపీసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇచ్చోడ, ఇంద్రవెల్లి, జైనథ్ కేజీబీవీల్లో సీఈసీ, ఎంపీహెచ్ డబ్ల్యూ కోర్సులు ఉన్నాయి. ఈసారి సిరికొండ మండలంలోని కేజీబీవీకు సైతం ఇంటర్ కోసం అనుమతులు రానున్నాయి.

సకల సౌకర్యాలు..

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. విద్యార్థినిల చదువులకు ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా చర్యలు చేపడుతున్నారు. చదువుకోవాలనే ఆతృత ఉండి ఆర్థిక స్తోమత లేని పేద విద్యార్థినులకు ఈ విద్యాలయాలు వరంగా మారాయి. ప్రతిరోజూ మెనూ ప్రకారం రుచికరమైన శాకాహార, మాంసాహార భోజనం అందించడంతో పాటు వారి ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. విద్యార్థినులు చదువులకే పరిమితం కాకుండా వృత్తి విద్యా కోర్సులపై కూడా శిక్షణ కల్పిస్తున్నారు. అలాగే ఆత్మరక్షణ కోసం కరాటే శిక్షణ, ఇలా ఎన్నో సౌకర్యాలను కల్పిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..



పేద బాలికలు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలను సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వం విద్యార్థులకు సకల వసతులు కల్పించడంతో పాటు ప్రతి విద్యార్థి చదువులో రాణించే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుంది. ఇప్పటికే దరఖాస్తులు ప్రారంభమయ్యాయి. చేరాలని ఆసక్తి ఉన్న బాలికలు అందుబాటులో ఉన్న కేజీబీవీకి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి.

ఉదయశ్రీ, సెక్టోరల్ అధికారి, ఆదిలాబాద్

కేసీఆర్ కృషితో ఆకుపచ్చ తెలంగాణ

- అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- గండిరామన్న అర్బన్ పార్కులో సఫారీ రైడ్ ప్రారంభం
- రూ.39 లక్షలతో నాలుగు నూతన వాహనాలు ఏర్పాటు



సఫారీ వాహనాన్ని డ్రైవింగ్ చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఆయన వెంట కలెక్టర్, ఎస్పీ, జెడ్పీ చైర్‌పర్సన్

నిర్మల్ టౌన్: ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో రాష్ట్రం ఆకుపచ్చ తెలంగాణగా మారిందని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. పచ్చదనం పెంపు, అడవులు, వన్య ప్రాణుల సంరక్షణకు సీఎం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. నిర్మల్ శివారులోని గండి రామన్న హరితవనంలో సఫారీ రైడ్‌ను గురువారం మంత్రి ప్రారంభించారు. రూ.39 లక్షలతో కొనుగోలు చేసిన నాలుగు సఫారీ, రెండు ఫారెస్ట్ పెట్రోలింగ్ వాహనాలకు జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మితో కలిసి ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. అనంతం సఫారీ వాహనాన్ని మంత్రి స్వయంగా నడుపుతూ అర్బన్ పార్క్‌లో విహరించారు. అనంతరం ఐకేరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత హరితవనం పేరిట 230 కోట్ల మొక్కలు నాటాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ ముందుకు వెళ్లారన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా హరితహారం కార్యక్రమాన్ని చేపట్టి మొక్కలు నాటుతున్నామని తెలిపారు. ఇప్పటికే లక్ష్యాన్ని అధిగమించామని చెప్పారు. ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని తెలిపారు. ప్రతీ గ్రామపంచాయతీ, మున్సిపాలిటీలో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నామన్నారు.

జిల్లాలో 431.90 కోట్ల మొక్కలు..

నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 431.90 లక్షల మొక్కలు నాటినట్లు వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అడవుల సంరక్షణ చర్యలతో వన్య ప్రాణుల సంఖ్య పెరగిందన్నారు. మహారాష్ట్రలోని తడోబా టైగర్ రిజర్వ్ నుంచి కవ్వాల్ టైగర్ రిజర్వ్ జోన్‌కు పులులు వలస వచ్చి ఆవాసం ఏర్పాటు చేసుకుంటున్నాయని, నిర్మల్ జిల్లా కేంద్రాన్ని పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెస్తున్నామన్నారు. త్వరలో నిర్మల్‌లో హరిత హోటల్ నిర్మిస్తామని చెప్పారు.

పర్యావరణ హిత టూరిజం..

అడవుల ప్రత్యేకత కాపాడుతూనే, పర్యావరణ హిత టూరిజాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గండి రామన్న హరితవనంలో సందర్శించే వారికి సరికొత్త అనుభూతిని కల్పించేందుకు ప్రత్యేక ఓపెన్ టాప్ సఫారీ వాహనాలు, పెట్రోలింగ్ వాహనాలని అందుబాటులోకి తెచ్చామని వెల్లడించారు. వీటి కోసం రూ.39 లక్షల వెచ్చించామని తెలిపారు. అర్బన్ పార్కులో జంగల్ సఫారీని నిర్వహించడం అద్భుతంగా ఉందన్నారు. పార్కులో అడ్వెంచర్ కార్యక్రమాలతోపాటు పిల్లలు, పెద్దలందరికీ ఆహ్లాదం, వినోదం కలిగించేలా ఏర్పాట్లు చేశామన్నారు. హరితవనంలో కోతుల సంరక్షణ, పునరావాస కేంద్రం, మూషిక జింకల పార్కు, చైన్ లింక్, ఎకో హట్స్, సైక్లింగ్, వాచ్ టవర్స్ చిన్న పిల్లల ఆట స్థలం అందుబాటులోకి తెచ్చామని వివరించారు.

హరితోత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ..

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 19న నిర్వహించనున్న హరితోత్సవ్ పోస్టర్‌ను మంత్రి ఐకేరెడ్డి ఆవిష్కరించారు. అటవీ శాఖలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ డోబ్రియల్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ జోన్ ఫీల్డ్ డైరెక్టర్ వినోద్ కుమార్, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్, బాసర సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ శర్వణన్, జిల్లా అటవీ అధికారి సునీల్ హిరామత్ తదితరులు పాల్గొన్నారు.

స్పందిస్తున్నారు... సాయమందిస్తున్నారు

బోథ్: మండలంలోని గుర్రాలతాండ గ్రామానికి చెందిన మల్హారిసింగ్ కుటుంబ దీనగాథను ఈ నెల 3వ తేదీన 'ఇంటికి పెద్దదిక్కు... ఆ చిన్నారి' శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైంది. భార్య మృతిచెందడం, మల్హారిసింగ్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడటం, ఓ కూతురు మానసిక వికలాంగురాలు కావడం, చిన్న కూతురుకు మాటలు రాకపోవడంతో ఆ కుటుంబ దీనావస్థను చూసి మానవతావాదులు స్పందిస్తున్నారు. మల్హారి సింగ్ కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు వస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ జూనియర్ కళాశాలల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ కుటుంబాన్ని పరామర్శించారు. నిత్యావసర సరుకులను అందించారు. కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు. మరికొంత మంది ఫోన్‌పే ద్వారా తమ సహాయాన్ని అందిస్తున్నారు.

సాక్షి స్పందన

స్పందించాల్సిన దాతలు ఫోన్‌పే నం.7670921393



మల్హారి సింగ్‌ను పరామర్శిస్తున్న బలరాం జాదవ్

క్లుప్తంగా

'షరతుల్లేకుండా సాయం అందించాలి'

భైంసాటౌన్: బీసీల్లోని చేతి కులవృత్తుల కుటుంబాలకు షరతులు లేకుండా రూ.లక్ష ఆర్థికసాయం అందించాలని బీసీ హక్కుల పరిరక్షణ సమితి ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ సుంకెట పోశెట్టి అన్నారు. ఈమేరకు గురువారం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ అర్హులకు సకాలంలో కుల, ఆదాయ ధ్రువపత్రాలు అందించడంతోపాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు గడువు పొడిగించాలన్నారు. వివిధ కులసంఘాల నాయకులు లింగన్న, విక్రమ్, దిలీప్, రాములు తదితరులున్నారు.

నేడు చేప ప్రసాదం పంపిణీ

సారంగాపూర్: మండలంలోని బీరవెల్లిలో గ్రామానికే చెందిన సగ్గం లింగం, కృష్ణ సోదరులు శుక్రవారం తెల్లవారుజామున చేప ప్రసాదం పంపిణీ చేస్తారని సర్పంచ్ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఆస్తమా, ఉబ్బసం ఉన్నవారు చేప మందు వేయించుకోవాలని ఆయన సూచించారు. ఇప్పటికే గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో చేపమందు పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం చిన్నారులకు ఎంపీపీ కల్పన అక్షరాభ్యాసం చేయించారు. ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, ఆయాలు, చిన్నారుల తల్లులు తదితరులు ఉన్నారు.

ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

లక్ష్మణచాంద: ఎయిడ్స్ బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సభ్యులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని వడ్యాల్‌తండాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాప్తి చెందే విధానం, నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించారు. సర్పంచ్ పూలవతి, గ్రామీణ్ సపోర్టు ఫౌండేషన్ మేనేజర్ శ్రీనివాస్, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

పంచగుడి ఎత్తిపోతల పథకం కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి యోగేశ్వర ఎత్తిపోతల పథకం కమిటీని గురువారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎన్నికల అధికారులు మమత, విజయ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పంచగుడి ఎత్తిపోతల పథకం కమిటీ చైర్‌పర్సన్‌గా మామిడి గంగవ్వ, ఉపాధ్యక్షుడిగా దడిగే భోజన్న, ప్రధాన కార్యదర్శిగా నర్సారెడ్డి, సభ్యులుగా సాయన్న, సాయారెడ్డి, భోజారెడ్డి, ఆజోబ పటేల్, అనసూయను ఎన్నుకున్నారు. సర్పంచ్ ఎల్లన్న, వైస్ ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి, చిన్నొల్ల భోజారెడ్డి, రాజేశ్వర్, ఆసిబొద్దీన్ పటేల్, మోహన్ పాల్గొన్నారు.

'నిబంధనల మేరకు సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలి'

ఖానాపూర్: ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమవుతున్న తరుణంలో ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ సర్వశిక్ష అభియాన్ నిబంధనల మేరకే నిర్వహించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజేష్‌నాయక్ అన్నారు. గురువారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎటువంటి పైరవీలకు తావు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సర్దుబాటు చేస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ విషయమై కలెక్టర్‌తో పాటు డీఈవో, వరంగల్ ఆర్జేడీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. సమావేశంలో నాయకులు భిక్షపతి, మోహన్, సందీప్, చందు తదితరులు ఉన్నారు.

బాబా ఆలయంలో పూజలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గండి రామన్న క్షేత్రంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం అన్నదాతలుగా నిలిచిన లోక వసంత– అశోక్, సీహెచ్ స్రవంతి– గజానంద్ దంపతులను ఆలయ సింగిల్ ట్రస్ట్ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి సన్మానించారు. ఆలయ ప్రాంగణంలోని సాయిద్వారక కల్యాణ మండపాన్ని అద్దెకు ఇస్తున్నామని.. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాయి దీక్ష సేవా సమితి సభ్యులు ఉప్పుల నందు, గోవర్ధన్, సోమేష్, భూషణ్, చౌదరి, శ్రీధర్, రేణుక దాస్ తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం సందడి నెలకొంది. హారతి కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాబాను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

దేశానికి ఆదర్శంగా 'మిషన్ కాకతీయ'

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్
- ఊరూరా చెరువుల పండుగ
- బతుకమ్మ ఆడి పాడిన మహిళలు
- కట్టమైసమ్మకు ప్రత్యేక పూజలు



ఖానాపూర్: బీర్నందిలో ఎమ్మెల్యే రేఖానాయక్



లోకేశ్వరం మండలం ధర్మోరలో బతుకమ్మలతో చెరువుకట్ట వద్దకు వెళ్తున్న గ్రామస్తులు

ఖానాపూర్: చెరువుల పునరుద్ధరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ కాకతీయ పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజైన గురువారం ఊరూరా చెరువుల పండుగ నిర్వహించారు. ఖానాపూర్ మండలంలోని ఎర్వచింతల్, బీర్నంది గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. చెరువు కట్టపై ఉత్సవా ల్లో పాల్గొన్నారు. గోపాల్, సువర్ణ, మోహిద్, వాల్‌సింగ్, శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి పాల్గొన్నారు. ఖానాపూర్ మండలంలోని ఆయా గ్రామాల్లోని చెరువుల వద్ద పూజలు చేశారు. స్వప్న, సాగర్, చిన్నయ్య, రాజిరెడ్డి, కృష్ణ, భూమన్న, నర్సయ్య, మల్లేష్, లింగు, మారుతి, చంద్రయ్య ఉన్నారు.

కుభీర్: మండలంలోని ఆయా గ్రామాల్లో చెరువుల వద్దకు గ్రామస్తులు ఊరేగింపుగా వెళ్లి పూజలు చేశారు. దార్‌కుభీర్ చెరువు వద్ద జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ సాగర, ఆనంద్, ఎంఈవో చంద్రకాంత్, గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని ఆయాగ్రామాల్లో చెరువుల పండగ నిర్వహించారు. తహసీల్దార్ సరిత, ఎంపీడీవో సోల్‌మాన్‌రాజ్, సర్పంచ్‌లు ఎల్లన్న, శారద, నర్సన్న, శైలజ, నరేందర్‌రెడ్డి, నరేశ్, వైస్‌ఎంపీపీ నారాయణ్‌రెడ్డి ఉన్నారు.

భైంసా: బాసరలోని పోచమ్మ కాలనీలో ఆలయంతోపాటు పెద్ద చెరువుకు పూజలు చేశారు. సర్పంచ్ లక్ష్మణ్‌రావు, ఎస్సై మహేశ్, తదితరులున్నారు.

సారంగాపూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో చెరువుల పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు రాధ, అడెల్లి ఆలయ రెనోవేషన్ కమిటీ అధ్యక్షుడు ఆయిటి చందు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

పెంబి: మండలంలోని ఆయా గ్రామాల్లో చెరువుల పండుగ నిర్వహించారు. సర్పంచ్‌లు పూర్ణచందర్ గౌడ్, సుధాకర్, మహేందర్, వైస్ ఎంపీపీ గంగారెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన అదనపు కలెక్టర్

దిలావర్‌పూర్: మండల కేంద్రంతోపాటు గుండంపల్లి, బన్సపల్లి తదితర గ్రామాల్లో చెరువుల పండుగ ఘనంగా నిర్వహించారు. కాల్వ గ్రామంలో అదనపు కలెక్టర్ రాంబాబు పాల్గొన్నారు. దిలావర్‌పూర్, గుండంపల్లి తదితర గ్రామాల్లోని చెరువుల వద్ద కట్టమైసమ్మను పూజలు చేశారు. ఎంపీపీ పాల్దె అక్షర అనిల్, జెడ్పీటీసీ తక్కల రమణారెడ్డి, దిలావర్‌పూర్ సర్పంచ్ వీరేశ్‌కుమార్, కాల్వ సర్పంచ్ ఆడెపు తిరుమల శ్రీనివాస్, బన్సపల్లి సర్పంచ్ పోల పద్మవిక్రమ్, తహసీల్దార్ కరీం, ఎంపీడీఓ మోహన్, ఏపీఓ దివ్యారెడ్డి, ఎంపీఓ అజీజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో లక్ష్మి చెరువు వద్ద మహిళలు బతుకమ్మ ఆడారు. సర్పంచ్ రాంరెడ్డి, జెడ్పీటీసీ చిన్నరామయ్య, మల్లేశ్ పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని ఆయా గ్రామాల్లో చెరువుల పండుగ నిర్వహించారు. లక్ష్మణచాంద చెరువు వద్ద ఎంపీపీ పద్మ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిపాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజేశ్వర్, తహసీల్దార్ కవితారెడ్డి, సర్పంచ్ ముత్యంరెడ్డి, ఎంపీడీవో శేఖర్, ఎంపీవో నసీరుద్దీన్, ఎంపీటీసీ నర్సారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సిరాజ్, బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్, మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఇరిగేషన్ ఏఈ మధుకర్ పాల్గొన్నారు.

కుంటాల: గ్రామాల్లో చెరువుల పండుగ నిర్వహించారు. ఎంపీపీ ఆప్క గజ్జారాంయాదవ్, వైస్ ఎంపీపీ మానిక నవీన్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, తహసీల్దార్ కలీం, ఏవో సోమలింగారెడ్డి, ఎంపీవో రహీం, ఏపీవో నవీన్, తదితరులు పాల్గొన్నారు.

దస్తురాబాద్: మండలవ్యాప్తంగా చెరువుల పండుగ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ సింగరి కిషన్, తహసీల్దార్ లక్ష్మీ, సర్పంచ్‌లు రాజమణి, పోసవ్వ, నిరోష, భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తానూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో చెరువుల పండుగ ఘనంగా నిర్వహించారు.

ముధోల్: మండలవ్యాప్తంగా డప్పుచప్పుళ్ల నడుమ చెరువు వద్దకు వెళ్లి బతుకమ్మ ఆడారు. తరోడాలో మహిళలు బోనాలతో వెళ్లి పూజలు చేశారు.



లక్ష్మణచాందలో చెరువు వద్ద ఎంపీపీ పద్మ



బాసరలో..



సారంగపూర్: జామ్‌లో బతుకమ్మ ఆడుతూ..



దార్‌కుభీర్‌లో చెరువు వద్దకు వెళ్తున్న గ్రామస్తులు



నర్సాపూర్(జి)లో చెరువు వద్ద ప్రజాప్రతినిధులు



పెంబి మండలం మందపల్లి గ్రామంలో



తానూరు మండలం బెల్‌తరోడలో..



కాల్వలో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు



ముధోల్ మండలం తరోడాలో..



జాగిలమా.. మజాకా!

ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు మనుషులతోపాటు మూగజీవాలు కూడా చల్లని గాలి, నీడను కోరుకుంటున్నాయి. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించగా పోలీసులు డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో కూలర్ వద్ద సేదతీరుతున్న కుక్కను 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

-సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు

పెంబి: మండల కేంద్రంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జుపటేల్ ఆధ్వర్యంలో బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు టేకం భీంరావు కాంగ్రెస్‌లో చేరారు. గురువారం బీజేపీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో బొజ్జుపటేల్.. భీంరావుకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు స్వప్నిల్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్‌లో గురువారం గాలిదుమారంతో శివారు పొలాల్లో విద్యుత్ స్తంభం విరిగిపడింది. దీంతో రోజులాగే మేతకు వెళ్లిన గేదెలు ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాయి. ఇందూరి భీమన్నకు చెందిన రూ.60వేల విలువైన గేదె సంఘటన స్థలంలోనే మృతిచెందింది. నాలం శ్రీనివాస్‌కు చెందిన మరో గేదె తీవ్రంగా గాయపడింది. అధికారులు సకాలంలో స్పందించి ఉంటే గేదెలు మృతి చెందేవి కావని స్థానికులు మండిపడుతున్నారు. సర్పంచ్ అడిదెల మహేందర్, రైతులు పాల్గొన్నారు.

నిఘా నీడలో పల్లెలు

- నేరాల అదుపునకు ఊరూరా సీసీ కెమెరాలు
- సత్ఫలితాలిస్తున్న పోలీసుల ప్రయోగం
- ముందుకొస్తున్న దాతలు



ముధోల్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా



ముధోల్‌లో సీసీ కెమెరాల ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తున్న పోలీసులు

ముధోల్: నేరాల నియంత్రణకు పోలీసులు అన్ని చర్యలు పకడ్బందీగా చేపడుతున్నారు. ప్రజలకు సాంకేతికతపై అవగాహన కల్పిస్తూ.. మోసాల బారిన పడకుండా చైతన్యపరుస్తున్నారు. ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, వ్యాపారులతో పలుమార్లు అవగాహన సమావేశాలు నిర్వహించి సీసీ కెమెరాలతో కలిగే ప్రయోజనాలను వివరించారు. దీంతో దాతలు, గ్రామస్తుల సహకారంతో మండలంలోని ఆయా గ్రామాల్లో కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు.

నేరాల నియంత్రణకు ఇవి ఎంతగానో తోడ్పడుతున్నాయి. అక్రమ ఇసుక రవాణా కట్టడి చేయడంతోపాటు దొంగతనం వంటి నేరాలు జరగడం లేదు. ముధోల్ మండలంలోని కారేగాం, గన్నోర, బ్రహ్మణ్‌గావ్, రువ్వి, రాంటెక్, తరోడా ఆష్ట, ఎడ్‌బిడ్, మచ్కల్ గ్రామాల్లో ప్రజలు, దాతలు ముందుకొచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు.

కలిగే ప్రయోజనాలివీ..

మండలంలోని ప్రతి గ్రామంలో 10కి తక్కువ కాకుండా.. పెద్ద గ్రామం అయితే 20 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ కెమెరాల వీడియోను రికార్డ్ చేసేందుకు అదే గ్రామంలోని ఓ భవనంలో కంప్యూటర్‌కు అనుసంధానించారు. దీంతో గ్రామంలో ఏం జరుగుతుందో ఇక్కడ వీక్షించవచ్చు.

గ్రామాల్లో ఇళ్లలో, కాలనీల్లో దొంగతనాలు, ఇతర సంఘటనలు జరిగినప్పుడు నిందితులను పట్టుకోవడం కొంత కష్టమయ్యేది. ఇలాంటి సమయాల్లో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. గ్రామాల్లో జరిగే ఇసుక అక్రమ రవాణా, మద్యం రవాణా, రోడ్లపై పోకిరిలు ఆగడాలు, గొడవలు, రోడ్డు ప్రమాదాలు సీసీ కెమెరాల్లో నిక్షిప్తం అవుతున్నాయి. వాటి ఆధారంగా నేరాలను అదుపు చేసేందుకు వీలుంటుంది. కొందరు దాతలు ముందుకొచ్చి కెమెరాలు కొనేందుకు సాయం అందిస్తున్నారు.

రక్షణ కోసమే ఏర్పాటు..



గ్రామాల్లో రక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు. దీంతో దొంగతనాలు, నేరాలు తగ్గుతాయి. గ్రామాల్లో అపరిచితులు సంచరించినా తెలుసుకునే వీలుంటుంది.

– సిద్ధయ్య, రాంటెక్

ప్రయోజనాలు వివరించారు



సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు మా గ్రామంలో అవగాహన కల్పించారు. వాటితో కలిగే ప్రయోజనాలు వివరించారు. ఏవైనా జరిగితే నిందితులను త్వరగా పట్టుకోవచ్చు.

– వినోద్‌కుమార్, రువ్వి

అవగాహన కల్పించాం

గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, గ్రామస్తులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాం. దీంతో పలు గ్రామాల్లో ఏర్పాటుకు ముందుకొచ్చారు. కొందరు వ్యాపారులు ముందుకొచ్చి కెమెరాల కొనుగోలుకు ఆర్థిక సహకారం అందజేశారు.

– వినోద్‌రెడ్డి, ముధోల్ సీఐ

'రాష్ట్రంలో ఎగిరేది కాషాయ జెండానే'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ ఖిల్లా: రాష్ట్రంలో ఎగిరేది కాషాయ జెండానేనని బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నిర్మల్‌లో బీజేవైఎం జిల్లా కార్యవర్గ సమావేశం బీజేవైఎం జిల్లా అధ్యక్షులు వొడిసెల అర్జున్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో యువమోర్చా కీలక పాత్ర వహించి కాషాయ జెండా ఎగిరేలా కృషి చేయాలని సూచించారు. యువ మోర్చా అధ్యక్షుడు వొడిసెల అర్జున్ మాట్లాడుతూ.. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నిర్వహిస్తున్న మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గాల్లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి, భారత ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిదేళ్లలో సాధించిన విజయాలు, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్, జిల్లా ఉపాధ్యక్షులు సంధుపట్ల శ్రవణ్, విట్టల్, గిల్లి విజయ్, నిర్మల్ అసెంబ్లీ కన్వీనర్ కొండజీ శ్రవణ్, బీజేవైఎం ఐటీ – సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రాథోడ్ సందీప్, ముధోల్ అసెంబ్లీ కన్వీనర్ ముల్లవరపు అనిల్, వివిధ మండలాల అధ్యక్షులు, సోషల్ మీడియా కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

అందుబాటులో విత్తనాలు

ముధోల్: మండలంలోని ఆయా గ్రామాల రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కావాల్సిన రైతులు ఆధార్‌తో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. డీఏపీ ఐపీఎల్ బస్తా ధర రూ.1350, ఐపీఎల్ 20:20 రూ.1120, సూపర్ ఎస్ఎస్‌పీ రూ.500, పారీలు15 కేజీ 24 రూ. 2400, యూరియా బస్తా ధర రూ. 267, సోయాబీన్ కేడీఎస్ రూ.2130, జేఎస్ 335 30కేజీ రూ.2,350గా ధరలు ఉన్నాయన్నారు.

బడిబాట

ఖానాపూర్: పట్టణంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రవిబాబు ఆధ్వర్యంలో గురువారం బడిబాట నిర్వహించారు.

లక్ష్మణచాంద: తిర్పెల్లి, నర్సాపూర్ (డబ్ల్యూ) గ్రామాల్లో బడిబాట నిర్వహించారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



పూజలు చేస్తున్న మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్‌రూరల్: ఆధ్యాత్మికత భావనలతోనే ప్రశాంతత సాధ్యమని మంత్రి ఐకేరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఎల్లపల్లి గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనకు మంత్రి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో 900 మందిరాలను ఇప్పటికే అభివృద్ధి చేస్తున్నామని.. ఎల్లపల్లిలో రూ.1.65కోట్లతో ఆరు ఆలయాలను నిర్మించినట్లు తెలిపారు. వచ్చే నెల నుంచి సొంత జాగా ఉన్న వారికి గృహలక్ష్మి పథకం కింద రూ.మూడు లక్షలు సాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, మురళీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి, ఆత్మ చైర్మన్ గంగారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంగాధర్, ముఠాపూర్ పీఏసీఎస్ చైర్మన్ బొండ్ల గంగాధర్, ఎన్.రాజారెడ్డి పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



స్థల దాతను సన్మానిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

తానూరు: ఆలయాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తొండాల గ్రామంలో ఖండోబా ఆలయంలో దేవతమూర్తి ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో పోతారెడ్డి, మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, చంద్రకాంత్, గోవింద్‌రావ్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ

భైంసా: బాసర మండల కేంద్రంలో శ్రీకృష్ణ యాదవ సంఘం భవన నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి భూమిపూజ చేశారు. గ్రామానికే చెందిన జిడ్డు పెద్ద సాయన్న, జిడ్డు చిన్నసాయన్న, పోసాని, నడిపి మల్లయ్య జ్ఞాపకార్థం వారి వారసులు సంఘ భవన నిర్మాణానికి స్థలం విరాళంగా అందించారు. ఈ మేరకు వారిని ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ అందజేత

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ గ్రామంలో భీమన్న ఆలయ నిర్మాణానికి రూ.25లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు ప్రొసీడింగ్‌ను సర్పంచ్ నర్సన్నకు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అందజేశారు.

పాఠశాల సందర్శన

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ ప్రాథమిక పాఠశాలలో ఉత్తమ బోధన అందడంతో అక్కడ చదువుతున్న విద్యార్థులు గురుకులం, నవోదయ, ఆదర్శ పాఠశాలలకు ఎంపికయ్యారు. బుధవారం లోకేశ్వరం మండలంలోని రాజురా వీడీసీ సభ్యులు పెంచికల్‌పాడ్ పాఠశాలను సందర్శించారు. అమలవుతున్న విద్యావిధానం తెలుసుకున్నారు. హెచ్‌ఎం ఎల్లన్న, ఎస్‌ఎంసీ చైర్మన్ బాబారావు, రాజురా వీడీసీ, ఎస్‌ఎంసీ సభ్యులు నరేష్, శ్రీధర్, గంగాధర్, రవి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

శిశుమందిర్ పునఃప్రారంభం

నర్సాపూర్(జి):మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీషు మీడియం ప్రాథమిక పాఠశాలను గురువారం కేతిరి సుధాకర్ రెడ్డి(బలగం మూవీ ఫేమ్ కొమురయ్య), శ్రీ శివానంద భారతి స్వామి (శబరిమాత ఆశ్రమం, మనోహరాబాద్) పునఃప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీటీసీ మల్లేష్, డాక్టర్ దామోదర్ రెడ్డి, కట్టా నాగాచారి, రాజేశ్వర్, వేణుమాధవ్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీరాంవార్ ధనంజయ్, రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్‌లో గురువారం బీఆర్‌ఎస్ నాయకుడు భూక్య జాన్సన్ నాయక్ పర్యటించారు. విద్యుదాఘాతంతో గుడిసె, వాహనం కాలిపోవడంతో అంబటి శ్రీను, వంగ రవి కుటుంబాలను పరామర్శించారు. నాయకులు ఉన్నారు.